ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేదీ 03.10.2024 సమయం: 19.05 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రవర్తన, విధి నిర్వహణలో బలమైన నైతిక విలువలను పాటించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విద్యార్థులకు పిలుపునిచ్చారు.

2. "ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పైలట్ ప్రాజెక్ట్ ను" కేంద్ర ప్రభుత్వం ఈరోజు ప్రారంభించింది.

3. దేశ వ్యాప్తంగా ఈరోజు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

4. లెబనాన్‌లో, ఇజ్రాయెల్ వైమానిక దాడుల కారణంగా పూర్తిగా నిర్వాసితులైన వారి సంఖ్య దాదాపు 1.2 మిలియన్లకు పెరిగింది.

**NEW. DAY PREZ-RAJASTHAN VISIT**

ప్రవర్తన, విధి నిర్వహణలో బలమైన నైతిక విలువలను పాటించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విద్యార్థులకు పిలుపునిచ్చారు. రెండు రోజుల రాజస్థాన్ పర్యటనలో భాగంగా ఈరోజు ఉదయపూర్‌లోని మోహన్‌లాల్ సుఖాడియా విశ్వ విద్యాలయం స్నాతకోత్సవంలో ఆమె ప్రసంగించారు. విద్యార్థులు తమ శీలాన్ని కించపరిచే ఎటువంటి వృత్తి జీవితంలో కొనసాగరాదని రాష్ట్రపతి అన్నారు. అత్యున్నతమైన నైతిక విలువలు తమ ప్రవర్తన, పని తీరులో ప్రతిబింబించాలని రాష్ట్రపతి సూచించారు. బాబా సాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ విద్య కంటే గుణమే ముఖ్యమని విశ్వసించారని రాష్టప్రతి పేర్కొన్నారు. జీవితంలోని ప్రతి విషయంలోనూ చిత్తశుద్ధి ఉండాలని విద్యార్థులకు సూచించారు. **21**వ శతాబ్దంలో ప్రతి రంగంలోనూ వేగంగా

మార్పులు చోటుచేసుకుంటున్నాయని, **2047** నాటికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, యువ తరం సహకారంతోనే ఈ జాతీయ లక్ష్యాన్ని సాధించగలమని రాష్ట్రపతి అన్నారు. ఈ కార్యక్రమానికి రాజస్థాన్ గవర్నర్ హరిభౌ బాగ్డే, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి ప్రేమ్ చంద్ బైర్వా, తదితరులు హాజరయ్యారు.

**GOVT INTERNSHIOP:**

ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం పైలట్ ప్రాజెక్ట్ ను కేంద్ర ప్రభుత్వం ఈరోజు ప్రారంభించింది. 2024-25 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఈ పథకం ద్వారా వచ్చే ఐదేళ్లలో 5 వందల ప్రముఖ కంపెనీల్లో కోటి మంది యువతకు 2024-25 లో 1 లక్ష 25 వేల ఇంటర్న్ షిప్ అవకాశాలను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. దీనిని ఆన్‌లైన్ పోర్టల్ pminternship.mca.gov.in ద్వారా అమలు చేస్తారు. అభ్యర్థులు ఈనెల 12 నుంచి 25వ తేది వరకు ఈ పోర్టల్ ద్వారా ఇంటర్న్ షిప్ కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కొక్క అభ్యర్థికి 12 నెలల పాటు ఈ ఇంటర్న్ షిప్ లభిస్తుంది. ఇంటర్న్ షిప్ చేసే అభ్యర్థులకు నెలకు 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తారు.

## JAISHANKAR-SRILANKA

విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ రేపు శ్రీలంకలో అధికారిక పర్యటన చేపడతారు. ఈ పర్యటనలో ఆయన శ్రీలంక నాయకత్వాన్ని కలుసుకుంటారు. భారతదేశం నైబర్‌హుడ్ ఫస్ట్ పాలసీ, సాగర్ దృక్పథానికి అనుగుణంగా, పరస్పర ప్రయోజనం కోసం దీర్ఘకాల భాగస్వామ్యాన్ని మరింత లోతుగా మార్చుకోవడంపై డాక్టర్ జై శంకర్ దృష్టి సారిస్తారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## MISSION KARMAYOGI WORKSHOP

ఫలితాలు లభించే పరిపాలన కోసం 'రూల్ టు రోల్' మార్పు జరగాలని కేంద్ర సిబ్బంది, ప్రజా

పిర్యాధులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ నొక్కి చెప్పారు. ఈ మార్పు ప్రభుత్వ ఉన్నతాధికారులు తమ నైపుణ్యాలను మెరుగ్గా ఉపయోగించడానికి దోహదం చేస్తుందన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన 'మిషన్ కర్మయోగి' వర్క్ షాప్‌లో మంత్రి ప్రసంగిస్తూ... సాంప్రదాయ నియమ-ఆధారిత వ్యవస్థ నుండి డైనమిక్, రోల్-బేస్డ్ ఫ్రేమ్‌వర్క్ కు మారుతున్న భారతదేశ పాలనా విధానంలో గణనీయమైన పరివర్తనను ఆయన ప్రముఖంగా తెలియజేశారు.

## ECI- J&K VOTER TURNOUT

జమ్మూ కాశ్మీర్ లో మూడు దశల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 63.88 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. 64.68 శాతం మంది పురుషులు, మహిళలు 63.04 శాతం మంది ఓటు వేశారని తెలిపారు. ఈనెల 8వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## PM – NAVRATRI

దేశ వ్యాప్తంగా ఈరోజు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నవరాత్రుల్లో అమ్మవారు అనేక అవతరాల్లో కనిపిస్తారని ఈ పవిత్ర పండుగ ప్రతి ఒక్కరికీ శుభప్రదంగా కావాలని నరేంద్ర సామాజిక మాధ్యమంలో ఆకాంక్షించారు. నవరాత్రుల మొదటి రోజున తాను ముకుళిత హస్తాలతో శైలపుత్రి మాతకు ప్రార్థన చేశానని ప్రధాన మంత్రి తెలిపారు. ఇలా ఉండగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పాటు వివిధ రాష్ట్రాల్లో నవరాత్రులు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయాన్ని, శ్రీశైలం మల్లికార్జున స్వామి, గద్వాల జోగులాంబ, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి, బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాలను అత్యంత సుందరంగా అలంకరించారు. భక్తులు బారులు తీరి అమ్మవారి దర్శనం చేసుకుంటున్నారు.

**KISHAN:**

హైదరాబాద్ లో మూసీ నది సుందరీకరణ పేరుతో అధికారులు పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఈరోజు హైదరాబాద్‌లో విలేకరులతో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా పేదల ఇళ్లను కూల్చివేస్తోందని, ఇందుకు వ్యతిరేకంగా తమ పార్టీ పేదలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతోందని విమర్శించారు. హైడ్రా చేపడుతున్న కూల్చివేతలపై కిషన్ రెడ్డి మాట్లాడుతూ... చెరువుల చుట్టుపక్కల - ధనవంతులు, సంపన్నులు నిర్మించుకున్న ఫామ్‌హౌస్‌లను కూల్చివేయడంలో కూడా కాంగ్రెస్ అదే పంథాను కనబరచాలని మంత్రి అన్నారు. ప్రధానాంశాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి కూల్చివేతలకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## 1.2 MILLIOM DISPLACED

లెబనాన్‌లో, ఇజ్రాయెల్ వైమానిక దాడుల కారణంగా పూర్తిగా నిర్వాసితులైన వారి సంఖ్య దాదాపు 1.2 మిలియన్లకు పెరిగింది. చాలా మంది నిర్వాసితులు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లి పోయారని నిన్న లెబనీస్ మంత్రుల మండలిలో డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ యూనిట్ విడుదల చేసిన నివేదికలో పేర్కొన్నారు. వేలాది మంది ప్రజలు విమానంలో సిరియాలోకి తరలివెళ్లారు. హిజ్బుల్లా అగ్రనాయకులు, ఆ సంస్థ సదుపాయులు, సౌకర్యాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేయడానికి ఇజ్రాయెల్ ఇటీవల బీరుట్, దాని శివారు ప్రాంతాలపై ముమ్మరంగా వైమానిక దాడులు చేసింది. అదే సమయంలో పరిమిత భూతల సైనిక చర్య ద్వారా లెబనాన్‌లోకి చొచ్చుకువెళ్లడంతో దక్షిణ, తూర్పు లెబనాన్, అలాగే బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాల నివాసితులు తమ ఇళ్లను విడిచిపెట్టి పారిపోవలసి వచ్చింది.

## MEA - USCIRF

అంతర్జాతీయ మత స్వేచ్ఛపై అమెరికా కమిషన్ ఇచ్చిన **USCIRF** నివేదికను భారతదేశం

తిరస్కరించింది, ఇది హానికరమైనదిగా పేర్కొంది. USCIRF నివేదికలో భారతదేశపు తాజా సమాచారం గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ... USCIRF ఒక రాజకీయ ఎజెండాతో కూడిన పక్షపాత సంస్థ అని విమర్శించారు. ఇది భారతదేశం గురించి వాస్తవాలను తప్పుగా సూచించడం, తప్పుడు కథనాలను ప్రచారం చేస్తోందన్నారు. USCIRF ఈ తరహా దుర్బుద్ధితో నడిచే ప్రయత్నాలను విరమించుకోవాలని, అమెరికాలో మానవ హక్కుల సమస్యలను పరిష్కరించడంలో తన సమయాన్ని మరింత ఉపయుక్తంగా వినియోగించుకోవాలని విదేశాంగ ప్రతినిధి USCIRF కి సూచించారు.

**CM-CARD:**

తెలంగాణలో ఫ్యామిలీ డిజిటల్ కార్డులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సికింద్రాబాద్‌లోని హాకీ గ్రౌండ్స్ లో ఈరోజు ప్రారంభించారు. 10 ఏళ్లుగా ప్రజలు అనేక అభ్యర్థనలు చేసినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం డిజిటల్ కార్డుల సమస్యపై స్పందించలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రతి పేదవాడికి రేషన్‌కార్డులు అందించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కుటుంబ డిజిటల్ కార్డులను ప్రవేశపెట్టామని, సంక్షేమ పథకాలకు సంబంధించి వివిధ శాఖల నుంచి జోడించిన సమాచారం ఈ ఒక్క కార్డులో పొందుపరచడమైందని ముఖ్యమంత్రి తెలిపారు. రేషన్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, ఇతర సంక్షేమ పథకాలకు ఈ కార్డు ఉపయోగపడుతుందని చెప్పారు. హైదరాబాద్‌ను కాపాడేందుకే హైడ్రా, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు చేపట్టామని, వీటిపై ఏవైనా సూచనలను స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.

**LADDU:**

తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూల తయారీలో జంతు కొవ్వును వినియోగిస్తున్నారనే ఆరోపణలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై

సుప్రీంకోర్టు రేపు విచారణ చేపడుతుంది. ఈరోజు విచారణ జరగాల్సిన ఉన్న ఈ కేసుపై రేపు విచారణ చేపట్టాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టును కోరారు. జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ అభ్యర్థనను అంగీకరించింది.